ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శుక్రవారం 25 జూలై 2025



బాలబడి.. నూతన ఒరవడి

- అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక పార్య పుస్తకాలు
- నవచేతన, ఆధార్ శిల పేరుతో రూపకల్పన

6లో





కిడ్నీ సమస్యతో బాధపడుతున్న సవర భూగన్న, సవర మంగయ్య



మరో ఉద్దానం

- అడ్డాకులగూడ, దిగువదారబలో కిడ్నీ బాధితులు
- ఏడాదిన్నరలో ఐదుగురి మృతి
- డయాలసిస్ దశలో మరికొందరు
- ఏజెన్సీలో పెరుగుతున్న సీకేడీ రోగులు

అడ్డాకులగూడ గ్రామం

సీతంపేట రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం ప్రాంతం అంటే కిడ్నీ వ్యాధిగ్రస్తులే ఎక్కువగా గుర్తొస్తారు. సీతంపేట ఏజెన్సీ కూడా మరో ఉద్దానంలా మారబోతుందా? అంటే ఇక్కడ పరిస్థితులు బట్టి చూస్తే అలాగే అనిపిస్తోంది. మండలంలోని దారబ పంచాయతీ అడ్డాకులగూడ, దిగువదారబ గ్రామాల్లో కిడ్నీ వ్యాధి బాధితులు ఎక్కువ మంది ఉన్నారు. అడ్డాకులగూడకు చెందిన సవర అప్పయ్య, సవర భూగన్న, దిగువదారబకు చెందిన సవర మంగయ్యతో పాటు మరికొంత మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ప్రస్తుతం వీరు ఎంతో వ్యయప్రయాన లకు ఓర్చి కుటుంబసభ్యుల సహకారంతో పాలకొండ ఏరియా ఆసుపత్రికి వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారు. వారంలో మూడు రోజుల పాటు డయాలసిస్ కోసం 14 కిలోమీటర్ల దూరం ఆటోలో వెళ్లి రావాల్సి వస్తోందని వాపోతున్నారు. మందులు కొనుగోలు చేయలేక నానా ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నామని చెబుతున్నారు.

కారణలేంటో?

అడ్డాకులగూడ, దిగువదారబ గ్రామాల్లో కిడ్నీ వ్యాధి ప్రబలడానికి సరైన కారణాలు తెలియడం లేదు. తాగునీరే కిడ్నీ వ్యాధికి కారణమై ఉంటుందని ఆయా గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అడ్డాకులగూడలో మినీ రక్షిత మంచినీటి పథకంతో పాటు సోలార్ స్కీం ఉంది. దిగువదారబలో మినీ రక్షిత పథకం ఉంది. వీటి ద్వారానే ఆయా గ్రామల ప్రజలకు తాగునీరు (మిగతా 8వ పేజీలో..)

ఏడాదిన్నరలో ఐదుగురు మృత్యువాత

అడ్డాకులగూడలో 25 కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే, గత ఏడాదిన్నరలో గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. సవర సొంబూరు, ఆయన భార్య బంగారమ్మ, సవర భూగన్న, ఆయన 18ఏళ్ల కుమార్తె సివాసరితో పాటు సవర మిలిత అనే మహిళ కిడ్నీ వ్యాధికి బలైయ్యారు. ఏడాదిన్నరలో ఐదు గురు మృత్యువాత పడడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు.

మా దృష్టికి రాలేదు

సీతంపేట ఏజెన్సీలో సీకేడీ కేసులు నమోదైనట్లు మా దృష్టికి రాలేదు. పీహెచ్‌సీలకు కూడా సమాచారం లేదు. కిడ్నీ రోగులు ఉన్న అడ్డాకులగూడ, దిగువదారబ గ్రామాలను సందర్శిస్తాం. ఈ గ్రామాల్లో కిడ్నీ వ్యాధి ప్రబలడానికి కారణమేంటో తెలుసుకుంటాం.

-విజయపార్వతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో

గృహ నిర్మాణాలు
వేగవంతం కావాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



కన్నయ్యగూడలో గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం/కురుపాం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎం జన్మన్ పథకం కింద చేపడుతున్న గృహ నిర్మాణాలు మరింత వేగవంతం కావాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ఆయన గురువారం పర్యటించారు. పీఎం జన్మన్‌లో మంజూరైన గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పీఎం జన్మన్ కింద ఐదు వేల గృహాలు మంజూరైనట్లు తెలిపారు. వీటిలో 1600 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని, 130 వరకు ఇళ్లు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన వాటిని డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎం జన్మన్ పథకం కింద ఒక్కో ఇంటికి రూ.2.39లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం భద్రగిరి సీహెచ్‌సీ నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ నెలాఖరులోగా పనులు పూర్తిచేసి భవనాన్ని సిద్ధం చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాలు వంటివి ప్రబలుతున్నాయని, ఇటువంటి తరుణంలో పాత భవనంలో రోగులకు బెడ్స్ సరిపోవని, త్వరగా కొత్త భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. అనంతరం (మిగతా 8వ పేజీలో..)

శివారు భూములకు
సాగునీరు అందేనా?

- అధ్వానంగా వీఆర్ఎస్ కుడి, ఎడమ కాలువలు
- నిలిచిన ఆధునికీకరణ పనులు



కొండబుచ్చింపేట సమీపంలో పిల్ల కాలువలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

మక్కువ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ఇప్పటికే మొదలైంది. రైతన్న వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యాడు. అయితే, సాగునీటి కాలువలు పిచ్చిమొక్కలు, పూడిక పేరుకుపోయి అధ్వానంగా ఉన్నాయి. దీంతో ఈ ఏడాది శివారు భూములకు సాగునీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. మండలంలోని శంబర గ్రామ సమీపంలోని వెంగళరాయ సాగర్(వీఆర్ఎస్) జలాశయం నుంచి మక్కువ, సీతానగరం, బొబ్బిలి మండలాల పరిధిలో 24,700 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. అయితే, గత వైసీపీ ప్రభుత్వం వీఆర్ఎస్ కుడి, ఎడమ ప్రధాన కాలువల అభివృద్ధిని పట్టించుకోలేదు. జైకా నిధులు సుమారు రూ.62 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉన్నా నిర్లక్ష్యం చేసింది. ప్రధాన కాలువల్లో కొంతమేర లైనింగ్ ప్రక్రియ నిర్వహించింది. చేసిన పనులకు బిల్లులు అందజేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులు మధ్యలో ఆపేశాడు. ప్రస్తుతం కుడి, ఎడమ కాలువల్లో పిచ్చి మొక్కలు పేరుకుపోయి సాగునీరు ప్రవహించని పరిస్థితి నెలకొంది. శంబర వద్ద గోముఖి ఆక్విడెక్ట్ కూలిపోయింది. చప్పబుచ్చింపేట సమీపంలో షట్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీనివల్ల సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో శివారు ప్రాంతాలైన కోన, గోపాలపురం, తూరుమామిడి, శాంతేశ్వరం గ్రామాలకు పూర్తిస్థాయిలో (మిగతా 8వ పేజీలో..)



భామిని: నులకజోడులో రహదారిపై పారుతున్న వర్షపు నీరు



సీతంపేట రూరల్: కర్రగూడ రహదారిపై కూలిన భారీ వృక్షం

భారీ వర్షం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, మక్కువ, సాలూరు, భామిని, సీతంపేట, తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. అనేక ప్రాంతాల్లో పంట పొలాలు జలమయమయ్యాయి. వరి నారు నీట మునిగింది. వివిధ ప్రాంతాల్లోని రహదారుల్లో మోకాలి లోతున నీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. భామిని మండలంలోని వడ్డంగి, లోహరజోల, నులకజోడులో కురిసిన వర్షంతో ఊరగెడ్డ పొంగిపొర్లింది. తివ్వకొండపై నుంచి వరదతో లోహరజోల, బిల్లుమడ, నులకజోడు ప్రాంతాల్లో పొలాలు జలమయమయ్యాయి. సీతంపేట మండలం దారబ పంచాయతీ కర్రగూడకు వెళ్లే రోడ్డుపై భారీ చింత చెట్టు నేలకూలింది. దీంతో రాకపోకలు స్తంభించాయి.

- ఆంధ్రజ్యోతి బృందం

స్మార్ట్ మీటర్లతో
విద్యుత్ పొదుపు

- త్వరలో గృహాలకు అమర్చుతాం
- ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మల్లికార్జునరావు



మాట్లాడుతున్న ఎస్ఈ, పక్కన ఈఈ

పార్వతీపురంటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతోనే విద్యుత్‌ను పొదుపు చేయవచ్చునని ఏపీఈపీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.మల్లికార్జునరావు అన్నారు. గురువారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముందుగా ప్రభుత్వ, వాణిజ్య కేంద్రాలతో పాటు పరిశ్రమల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 'వినియోగదారుల్లో నెలకొన్న అపోహలను పోగొట్టేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. జిల్లాలో ఇప్పటికే 13,229 స్మార్ట్ మీటర్లను బిగించాం. దశల వారిగా గృహాలకు కూడా అమర్చేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. పాతమీటర్ల కంటే స్మార్ట్ మీటర్లతో తక్కువ విద్యుత్ ఖర్చు అవుతుంది. వాటిని ఏర్పాటు చేసే సమయంలో ఎటువంటి చార్జీలు చెల్లించనవసరం లేదు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఆర్సీ) నిర్ణయించిన టారీఫ్ ప్రకారమే విద్యుత్ బిల్లులు వసూలు చేస్తాం. సందేహాల నివృత్తి కోసం వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబరు 1912ను సంప్రదించవచ్చు.' అని తెలిపారు. ఈ సమావేశంలో ఈఈ గోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

- బిగించకుండా ప్రజలు అడ్డుకోవాలి
- వామపక్ష నాయకుల పిలుపు

8లో

నిధులు సరే.. పనులేవీ?

- నెరవేరని ఇంటింటి తాగునీటి లక్ష్యం
- గ్రామాల్లో నత్తనడక పనులు

7లో



ఉపాధి కోసం వెళ్లి.. విగతజీవిగా మారి

- కేరళలో మన్యం యువకుడి ఆత్మహత్య

7లో

శ్రావణం.. శుభకరం

- నేటి నుంచి శ్రావణ మాసం
- శుభ కార్యక్రమాలకు అనువైన కాలం

6లో



నాడు

బురదమయంగా పదాలవలస-చిమిడివలస రహదారి

ప్రగతి బాటలో..

- గిరిజన గ్రామాలకు పక్కా రహదారులు
- ప్రభుత్వ చొరవతో శరవేగంగా నిర్మాణాలు
- ఏజెన్సీకి కొత్త కళ.. గిరిపుత్రుల హర్షం

పార్వతీపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కనీస అభివృద్ధికి నోచని గిరిజన గ్రామాలు నేడు కొత్త రూపును సంతరించుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం చొరవతో ప్రగతి బాటలో పయనిస్తున్నాయి. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీలో శరవేగంగా రహదారుల నిర్మాణాలు జరుగుతున్నాయి. గిరిశిఖర గ్రామాల్లో కూడా బీటీ రహదారుల పనులు ఊపందుకున్నాయి. ఒకప్పుడు రాళ్లు.. రప్పలు.. గోతులతో దర్శనమిచ్చిన దారుల రూపురేఖలన్నీ మారుతున్నాయి. దశాబ్దాలుగా రోడ్డు సౌకర్యానికి నోచుకోని గిరిజన గ్రామాలు బీటీ రహదారులతో కళకళలాడుతున్నాయి. సుమారు రూ.145 కోట్లతో జిల్లాలో వంద రహదారుల నిర్మాణాలను పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనిలో భాగంగా ఇప్పటిఏ 35 రహదారుల నిర్మాణాలు పూర్తయ్యాయి. 65 రహదారుల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. వాటి నిర్మాణాలు పూర్తయితే వందలాది గిరిజన గ్రామాల ప్రజల దారి కష్టాలు తప్పుతాయి.

ఇదీ పరిస్థితి..

ఏ ప్రాంత అభివృద్ధికైనా రహదారులు కీలకం. అయితే గత వైసీపీ సర్కారు ఈ విషయాన్ని విస్మరించింది. రహదారుల నిర్మాణాల విషయంలో అలసత్వం ప్రదర్శించింది. కేవలం శంకుస్థాపనలకే పరిమితమైంది. కనీసం మరమ్మతులకు పైసలు కూడా విదల్చలేదు. దీంతో గత ఐదేళ్లుగా జిల్లాలో మైదాన, గిరిజన ప్రాంతవాసులు (మిగతా 8వ పేజీలో..)



నేడు

అద్దంలా మారిన పదాలవలస-చిమిడివలస రోడ్డు

బాలబడి.. నూతన ఒరవడి






- అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక పాఠ్య పుస్తకాలు
- నవచేతన, ఆధార్ శిల పేరుతో రూపకల్పన

నవచేతన పుస్తకం

రాజాం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయడంతో పాటు పూర్వ ప్రాథమిక విద్యలోనే ప్రయివేటు ప్లేస్కూళ్లకు ధీటుగా విద్యాబోధన సాగించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. దీనికోసం ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. మూడేళ్ల వయసు దాటిన చిన్నారులకు మెరుగైన విద్యాబోధనకు వీలుగా పాఠ్య పుస్తకాలను జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసింది. ఇంగ్లిష్, లెక్కలు, తెలుగుతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్‌ను సులభంగా నేర్చుకునే రీతిలో పుస్తకాలను రూపొందించారు. ఆటపాటలతో పాటు విద్యాబోధన చేయడానికి వీలుగా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కొత్తగా వచ్చిన పుస్తకాలను చదివేందుకు కేంద్రాలలో చిన్నారులు ఆసక్తి చూపుతున్నారని కార్యకర్తలు చెబుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు మానసికంగా, శారీరకంగా ఎదిగేలా శిక్షణకు నవచేతన, ఆధార్ శిల పేర్లతో పాఠ్య పుస్తకాలను రూపొందించారు. వీటిని కేంద్రాలను సరఫరా చేశారు. వీటిలోని అంశాలను కార్యకర్తలు అమలు చేయడంతోపాటు తల్లిదండ్రులకు వివరించాల్సి ఉంటుంది.

కార్యకర్తలకు 'నవచేతన'

అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు ఈ ఏడాది కొత్తగా నవచేతన, ఆధార్‌శిల పేరిట రెండు పుస్తకాలు అందజేశారు బాల్యారంభ ప్రేరణకు జాతీయ చట్టం-2025 మేరకు పుట్టినప్పటి నుంచి మూడేళ్ల వయసు వరకూ ప్రేరణ కృత్యాలు నేర్పించడం 'నవచేతన' ముఖ్య ఉద్దేశం. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం వంటి వాటిని వివరిస్తారు. పిండ భద్రత, రక్షణ, ప్రతిస్పందన, వంటివాటిపై కార్యకర్తలు అవగాహన కల్పిస్తారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగించడం, తల్లి ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకుంటే పోషకాలు అందుతాయో వివరిస్తారు.



'ఆధార్ శిల'తో ఎలాగంటే..

బాల్య ఆరంభ సంరక్షణ, విద్య నేర్పించడం 'ఆధార్ శిల' పుస్తకాల లక్ష్యం. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లల పెంపకం, కుటుంబ సభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తారు. చిన్నారులకు శారీరక భాష, మేధ, సాంస్కృతిక, సృజనాత్మక, సామూహిక భావోద్వేగాభివృద్ధి వంటివి నేర్పిస్తారు. శారీరక, మానసిక ఆరోగ్యం పెరుగుదల వంటివి వివరిస్తారు.


చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న కార్యకర్త

చిన్నారుల ఎదుగుదలకు దోహదం

పిల్లల్లో మెదడు అభివృద్ధి దశ ఆరేళ్ల లోపు పూర్తవుతుంది. ఈ సమయంలో సరైన సంరక్షణ, ప్రేరణ, అనుభవాత్మక కృత్యాలతో చిన్నారుల్లో సృజనాత్మక ఆలోచనాశక్తి, శ్రద్ధ ను పెంపొందిస్తారు. బాల్యారంభ దశ నుంచే అన్నివిధాలుగా ఎదిగేందుకు ఈ పుస్తకాలు దోహదపడతాయి. ఇప్పటికే కార్యకర్తలకు శిక్షణ ఇచ్చాం. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పుస్తకాలను సరఫరా చేశాం.

- టి.విమలారాణి, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఐసీడీఎస్, విజయనగరం

శ్రావణ శోభ

- నేటి నుంచి శ్రావణ మాసం
- శుభ కార్యక్రమాలకు అనువైన కాలం


గంటస్తంభం వద్ద గల మార్కెట్‌లో రద్దీ

విజయనగరం/రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): అత్యంత శ్రేష్ఠమైనదిగా చెప్పుకునే శ్రావణ మాసం వచ్చేసింది. శుక్రవారం నుంచే ఇది ప్రారంభం కానుంది. దీంతో ఊరూవాడా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటున్నాయి. అమ్మవారి ఆలయాలకు కొత్త కళ వస్తోంది. మహిళలు సకల సౌభాగ్యాలతో పాటు శ్రీమహాలక్ష్మి కటాక్షం పొందేందుకు వ్రతాలు, ఉపవాసాలు, కుంకుమ పూజలు ప్రారంభించనున్నారు. ఈ మాసంలో వచ్చే అన్ని శుక్రవారాల్లోనూ శ్రావణలక్ష్మికి పూజలు చేస్తారు. ఈ నెలలో ప్రధానంగా నాగుల పంచమి, ఆగస్టు 8న వరలక్ష్మీవ్రతం, 9న రాఖీ పౌర్ణమి, 12న సంకష్ట హర చతుర్థి, 16న శ్రీకృష్ణాష్టమి, 19న అజ ఏకాదశి, 23న పోలాల అమావాస్య ఉన్నాయి.

సిద్ధమైన ఆలయాలు

విజయనగరం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న అమ్మవార్ల ఆలయాలు శ్రావణ పూజల కోసం ముస్తాబయ్యాయి. నెల రోజుల పాటు చక్రర్నాన, విశిష్ట అర్చనలు నిర్వహించనున్నారు. విజయనగరం మూడులాంతర్లు వద్దనున్న పైడితల్లి చదురుగుడి, రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న వనంగుడి, హిమగిరి, సప్తగిరి రోడ్డులో ఉన్న సంతోషిమాత, కన్యకాపరమేశ్వరి తదితర ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.

మాంసాహారానికి తగ్గనున్న డిమాండ్

శ్రావణ మాసమంతా అధికశాతం మహిళా భక్తులతో పాటు, వారి ఇళ్లల్లో మాంసాహారానికి దూరంగా ఉంటారు. ఈ నేపథ్యంలో మాంసాహారానికి డిమాండ్ తగ్గనుంది. ఏటా శ్రావణ, కార్తీక మాసాల్లో చికెన్, మటన్ వ్యాపారం గణనీయంగా తగ్గుతుంటాయి.

శుభకార్యాలకు అనువుగా...

వివాహాలు.. గృహప్రవేశాల వంటి శుభ కార్యక్రమాలు ఈ నెలలోనే ఎక్కువగా నిర్వహించడం ఆనవాయితీ. దీనికి అనుగుణంగా ఈ నెల 26 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు భారీ సంఖ్యలో వివాహాలు జరుగనున్నాయి. గృహప్రవేశాలకూ అనేక మంది ముహూర్తాలు తీసుకున్నట్టు పురోహితులు చెబుతున్నారు.

నేటి నుంచి కుంకుమ పూజలు



పాలకొండ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోటదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 25 నుంచి కోటదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో సామూహిక శ్రావణమాస లక్ష కుంకుమార్చన, పూజలు నిర్వహించనున్నట్టు ఈవో వీవీ సూర్యనారాయణ, ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ ఈ ఏడాది ఐదు శ్రావణ శుక్రవారాలు వచ్చాయని తెలిపారు.

ఉదయం ఎండ.. సాయంత్రం వాన


అంతకాపల్లి సమీపంలో పొలాల్లో చేరిన నీరు

- నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి
- ఉభాలకు మేలు

ఉదయం భానుడి భగభగలు.. సాయంత్రం ఏకధాటిగా వర్షం... ఇదీ నాలుగైదు రోజులుగా ఈ ప్రాంతంలో వాతావరణం పరిస్థితి. ఉదయం ఎండ వేడిమికి ప్రజలు అల్లాడుతున్నారు. సాయంత్రం వేళల్లో కురుస్తున్న వర్షం అన్నదాతల్లో ఆనందాన్ని నింపుతోంది.

రాజాం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): వర్షంతో పట్టణ ప్రాంత ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల నుంచి ఇళ్లకు బయలుదేరే సమయంలో జోరుగా వాన కురుస్తుండడంతో జనజీవనం స్తంభించిపోతోంది. మరోవైపు పొలాల్లో నీరు చేరడంతోపాటు చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండడంతో రైతులు సంతోషిస్తున్నారు. వి.ఆర్.అగ్రహారం, అంతకాపల్లి, గురవాం, పొగిరి తదితర గ్రామాలలో ఉభాలకు సిద్ధమవుతున్నారు. కొన్నిచోట్ల ఆకుతీత పనులు ప్రారంభమయ్యాయి. నాట్లు సైతం పడుతున్నాయి. ఖరీఫ్ ఆశాజనకంగా ఉంటుదన్న ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఇది లాఉండగా... చిన్నపాటి వర్షం కురిసినా పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారడంతో రాజాం-శ్రీకాకుళం ప్రధాన రహదారి చెరువును తలపిస్తోంది. వాహన చోదకులు అవస్థలకు గురవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం చెరువులా మారిపోయింది.


రాజాం-శ్రీకాకుళం రోడ్డులో వాహన చోదకుల అవస్థలు

గుమ్మలక్ష్మీపురంలో...

గుమ్మలక్ష్మీపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. పంట పొలాలు నీట మునిగాయి. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ఈ వర్షం ఖరీఫ్ వ్యవసాయ పనులకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


గుమ్మలక్ష్మీపురం రహదారిలో వర్షపు నీరు


లోహరజోలలో జలమయమైన పొలాలు

పంట పొలాలు జలమయం

భామిని, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డంగి, లోహరజోల, నులకజోడులో గురువారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షంతో ఊరగెడ్డ పొంగిపొర్లి బీభత్సం సృష్టించింది. తివ్వకొండపై వస్తున్న వరదనీటితో గెడ్డ గట్టుకు గండి పడింది. దీంతో ఎగువకు వెళ్లాల్సిన నీరు పొలాల పైనుంచి ప్రవహించింది. దీంతో లోహరజోల, బిల్లుమడ, నులకజోడు ప్రాంతాల్లో పొలాలు జలమయమయ్యాయి. నులకజోడు ఎగువన కురిసిన వర్షంతో పొలాలు నీట మునిగాయని చెబుతున్నారు. మరో రెండు రోజుల వరకు నీరు తగ్గే అవకాశం కనిపించడం లేదని రైతులు చెబుతున్నారు.

సాలూరు ఏజెన్సీలో..

సాలూరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సాలూరు ఏజెన్సీలో గురువారం వర్షం కురిసింది. సాలూరు, మామిడిపల్లి, జీగిరాం తదితర గ్రామాల్లో వర్షం పడింది. నారుమళ్లకు నీరు తడి లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీగిరాంలో కురుస్తున్న వర్షం →





మక్కువలో..

మక్కువ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వికసించిన కదంబ పుష్పాలు



రాజాం, జూలై 24(ఆంధ్రజ్యోతి): కదంబ పుష్పం.. అరుదైన పువ్వు. పూజలకు విశిష్టమైన దిగా చెబుతారు. సుగంధ ద్రవ్యాల తయారీలో కూడా దీనిని వినియోగిస్తారు. అటువంటి చెట్టు రాజాం మండలం పెనుబాక పాఠశాల ప్రాంగ ణంలో ఉంది. ప్రస్తుతం చెట్టు నిండా పూవులతో కనువిందు చేస్తోంది. శుక్రవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుంది. ఇవి లలితా దేవికి ఎంతో ప్రీతికరమైనవని భక్తుల విశ్వాసం. ఈ పుష్పాలను అత్తరు తయారీలోనూ, బెరడు, వేర్లను ఆయుర్వేద వైద్యంలో వినియోగిస్తారని నిపుణులు చెబుతున్నారు. కదంబ కలపను బొమ్మల తయారీలోనూ వినియోగిస్తుంటారు.


పెనుబాక పాఠశాల ప్రాంగణంలోని కదంబ చెట్టు, కదంబ పుష్పాలు

పోలీసుశాఖ ప్రతిష్ఠను పెంచాలి

- నీతి, నిజాయతీతో సేవలు అందించాలి
- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): మంచి నడవడికతో ప్రొబేషనరీ ఎస్‌ఐలు పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. జిల్లాకు కేటాయించిన నలుగురు ప్రొబేషనరీ ఎస్‌ఐలు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శిక్షణలో నేర్చుకున్న అంశాల గురించి ఆయన వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికతను వినియోగించుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పోలీసు శాఖపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కానివ్వకుండా నీతి, నిజాయతీ, క్రమశిక్షణ, సేవా తత్పరతతో పని చేయాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, పోలీసు స్టేషన్ల రికార్డులు, దర్యాప్తు మెలకువలను తెలుసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ గోపాలనాయుడు, ప్రొబేషనరీ ఎస్‌ఐలు సాయిరామ్ పడాల్, నాని, సాయిరామ్, దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.


ఎస్‌ఐలతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్



డబ్ల్యూఏఐఓటీ ప్రతినిధితో రామ్ కార్తీక్

జపాన్ సదస్సులో మన వైద్యుడు

శృంగవరపుకోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జపాన్‌లో జరిగిన వరల్డ్ అగైనెస్ట్ ఇన్‌ఫెక్షన్స్ ఇన్ ఆర్థోపెడిక్స్ ట్రామా(డబ్ల్యూఏఐఓటీ) సదస్సులో శృంగవరపుకోట పట్టణానికి చెందిన డాక్టర్ రంధి రామ్ కార్తీక్ పాల్గొన్నారు. మన దేశం నుంచి ఈ సదస్సుకు ఇద్దరు వైద్యులు మాత్రమే హాజరయ్యారు. వీరిలో రామ్ ఒకరు కాగా..మరొకరు ముంబయికి చెందిన హిందుజా నుంచి హాజరయ్యారు. ఈ సదస్సులో బోన్ ఇన్‌ఫెక్షన్‌కు సంబంధించిన అంశాలపై పది నిమిషాలు ప్రజెంటేషన్ ఇచ్చారు.

పెచ్చులూడుతున్నాయ్

● శిథిల స్థితిలో రాజాం సామాజిక ఆసుపత్రి



పెచ్చులూడుతున్న పిల్లర్లు, శ్లాబ్

రాజాం రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాజాం సామాజిక ఆసుపత్రిలో పలు భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎక్కడికక్కడే పెచ్చులూడుతూ రోగుల్ని భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఏ క్షణాన ఎక్కడ పెచ్చులూడి ప్రమాదం సంభవిస్తుందోనని రోగులు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు నాబార్డ్ నిధులతో నాలుగేళ్ల కిందట ఆసుపత్రిలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరో వైపు గతంలో నిర్మించిన భవనాలు పాడవుతున్నాయి. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న భవనాలకు మరమ్మతులు చేయించాల్సి ఉంది.

అశోక్‌ను కలిసిన అనకాపల్లి ఎమ్మెల్యే



అశోక్ గజపతిరాజును సత్కరిస్తున్న అనకాపల్లి ఎమ్మెల్యే రామకృష్ణ

విజయనగరం రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజుని గురువారం విజయనగరంలోని ఆయన నివాసంలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. గోవా గవర్నర్‌గా రాజ్యాంగ వ్యవస్థలో కీలకమైన మార్పులు తేవాలని ఆకాంక్షించారు. లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పాల్గొన్నారు.

● అశోక్ గజపతిరాజును గురువారం ఆయన నివాసంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, ప్రసాదుల రజనీతో పాటు ఏడవ డివిజన్ అధ్యక్షురాలు, డివిజన్ మహిళా కమిటీ ప్రతినిధులు కలిసి, శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగిఉండాలి



యాగం నిర్వహిస్తున్న దృశ్యం

గరివిడి, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని హిమాలయ వాసి అయిన స్వామి సిద్ధ యోగి పుంగవులు అన్నారు. గరివిడిలో గల శ్రీసూర్య విద్యా సౌరశక్తి పీఠంలో వేమకోటి సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పూర్ణాహుతి మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. 12 ఏళ్లగా ఇటువంటి యాగాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల నిరసన

శృంగవరపుకోట రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిందాల్ పరిశ్రమ వస్తుందని ఆశపడి భూములు ఇచ్చిన తమ బతుకులు తలకిందులు అయ్యాయని జిందాల్ నిర్వాసితులు వాపోయారు. ఈ మేరకు బొడ్డవర గ్రామంలో గురువారం వారంతా తలకిందులుగా నిరసన తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో ఎన్నో లాభాలు ఉంటాయని చెప్పి వాటిని విస్మరించారని వాపోయారు. తమ సాగులో ఉన్న భూముల్లో విలువైన చెట్లును నరికేశారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

ప్రమాదకరంగా ఫ్లైఓవర్

● గోతులతో నిండిన రహదారి

జామి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): భీమసింగి గ్రామం వద్ద ఉన్న ఫ్లైఓవర్ ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన రహదారిపై అనేక చోట్ల గోతులు దర్శనమిస్తున్నాయి. తరచూ ప్రమాదాలు జరిగి వాహనచోదకులు గాయాలపాలవుతున్నారు. అధికారులు మరమ్మతులు చేసినప్పటికీ యాధావిధిగా గోతులు ఏర్పడుతున్నాయి. శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.



వంతెనపై ఏర్పడిన గొయ్యి

నిధులు సరే.. పనులేవీ?

● నెరవేరని ఇంటింటి తాగునీటి లక్ష్యం
● గ్రామాల్లో నత్తనడక పనులు

గజపతినగరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ తాగునీరు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో గ్రామాల్లో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ పథకం అమల్లోకి రావడంతో అప్పట్లో నిధులు మంజూరు అయినా పనులు పూర్తి స్థాయిలో చేపట్టలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది అయినా పనులు పూర్తి చేయడం లేదని పలు గ్రామాల్లో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా గత వైసీపీ ప్రభుత్వం అప్పట్లో రూ.3కోట్ల 64లక్షల నిధులు మంజూరు చేసింది. అప్పట్లో పాలకులు, నాయకులు ప్రైవేటు ఏజెన్సీకి పనులు అప్పగించారు. నాశిరకం పైపులైన్లు వేయడంతో ఆరు నెలలు తిరగక ముందే లీక్‌లు ఏర్పడ్డాయి. దీంతో తాగునీరు వృథాగా పోయింది. గ్రామాల్లో ప్రజలు మరమ్మతులు చేపట్టాలని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.

రూ.21కోట్ల 34లక్షలు మంజూరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండో విడతగా మండలానికి రూ.21కోట్ల 34 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 39 గ్రామాల్లో పూర్తి స్థాయిలో పనులు చేపట్టి ఇంటింటికీ తాగునీరు కల్పించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా నేటికీ గ్రామాల్లో పనులు పూర్తి కాలేదు. మరికొన్ని గ్రామాల్లో పైపులైన్లు వేసినా నేటికీ తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని మరుపల్లి, ఎం.గుమడాం, కొత్తబగ్గాం, సాలిపేట, గజపతినగరం, జిన్నాం, బంగారమ్మపేట గ్రామాల్లో పనులు చేపడుతున్నట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

కలుషిత నీరు తాగాల్సి వస్తోంది

వర్షాకాలం కావడంతో పైపులైన్లు లీక్ కావడంతో కలుషితనీరు తాగాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంటింటికీ తాగునీరు పూర్తిస్థాయిలో అందించే దిశగా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.



మల్లునాయుడుపేటలో నిరుపయోగంగా కుళాయిలు

పనులు చేపడుతున్నాం

గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు అందించే దిశగా పనులు చేపడుతున్నాం. ప్రస్తుతం ఏడు గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. గతంలో వేసిన పైపులైన్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని మరమ్మతులు చేస్తున్నాం. మండలంలోని 39 గ్రామాల్లో తాగునీరు అందించాలన్నదే లక్ష్యంగా పనులు పూర్తి చేస్తున్నాం.

- శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

కూటమితోనే అభివృద్ధి

● మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు



ఇంటింటి ప్రచారం చేస్తున్న బంగార్రాజు

నెల్లిమర్ల, జూలై 24(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి సాధ్యమని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. దనానపేట గ్రామంలో గురువారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అకిరి ప్రసాదరావు, గేదెల రాజారావు, పోతల రాజప్పన్న, తాడ్డి సత్యనారాయణ, కోరాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

● ఎమ్మెల్యే లలితకుమారి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని తలారీ గ్రామంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలను వివరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, టీడీపీ మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

కల్వర్టుల నిర్మాణానికి రూ.17.50లక్షలు మంజూరు

రాజాం/ సంతకవిటి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాజాం-పొందూరు ప్రధాన రహదారిలో మూడు పైపు కల్వర్టుల నిర్మాణానికి రూ.17.50 లక్షల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుళ్లసీతారాంపురం, బొద్దూరు మధ్యలో కల్వర్టు నిర్మాణానికి రూ.5.75లక్షలు, గరికిపాడు-సంతకవిటి మధ్యలో కల్వర్టు నిర్మాణానికి రూ.5.65 లక్షలు, సంతకవిటి- మందరాడ రోడ్డులో కల్వర్టు నిర్మాణానికి రూ.5.65 లక్షలు మంజూరు చేయించినట్టు వివరించారు. ప్రధాన రహదారిలో కల్వర్టులు పూర్తిగా పాడైన విషయంపై స్థానిక నాయకులు తన దృష్టికి తీసుకురావడంతో ఆర్‌అండ్‌బీ అధికారులను పిలిపించి, అంచనాలు తయారు చేసి నివేదికలు ప్రభుత్వానికి పంపించడంతో ఈ నిధులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. త్వరలో పనులు పూర్తిచేసేలా అధికారులను ఆదేశిస్తామన్నారు

80 శాతం హాజరు ఉన్నవారికే కుట్టుమిషన్లు

రాజాం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శిక్షణా సమయంలో 80 శాతం హాజరు ఉన్నవారికే కుట్టుమిషన్లు మంజూరు చేస్తామని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలోని కొండంపేట సమీపంలో గత 40 రోజులుగా నిర్వహిస్తున్న కుట్టుశిక్షణా కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. కుట్టు శిక్షణ 90 రోజులు ఉండాలని నిబంధన ఉన్నప్పటికీ 80శాతం హాజరు ఉన్నవారికే అవకాశం ఉంటుందని చెప్పారు. శిక్షణ సమయం సమయం గడువు పూర్తయిన తర్వాత కూడా ముఖహాజరు ఉండాలన్నారు. ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా, 80 రోజులు హాజరు శాతం లేకపోయినా వారికి కుట్టుమిషన్లు మంజూరు చేయబోమని ఆయన హెచ్చరించారు. అనంతరం అంతికాపల్లి గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు.

ఆటో యూనియన్ నుంచి శంకరరావు తొలగింపు

విజయనగరం బాబామెట్ట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని విజయదుర్గా ఆటోయూనియన్ గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న బెహరా శంకరరావును గౌరవ అధ్యక్ష పదవి నుంచి తొలగించినట్టు ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పాండా తెలిపారు. గురువారం స్థానిక బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం సమీపంలోని ఆటో వర్కర్స్ యూనియన్ స్టాండ్‌లో రెడ్డి నారాయణరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గణేష్ పండా హాజరై మాట్లాడారు. గత రెండేళ్లుగా ఆటో యూనియన్‌పై అనేక కుట్రలు, కుతంత్రాలు పన్నుతూ యూనియన్ నాయకత్వం మీద తప్పుడు ఆరోపణలు చేయడం వల్ల బెహరా శంకరరావును తొలగించామన్నారు. యూనియన్ నాయకులు అప్పలరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొత్తవలస, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వర్షా కాలం ప్రారంభం అయినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ సూచించారు. మండలంలోని గొల్లలపాలెం, తుమ్మికాపల్లి పంచాయతీ సీరుబడ్డపేట, ముసిరాం గ్రామాలలో గురువారం వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. నిల్వ ఉంచిన మాంసం, చేపలు, గొంగూర వంటివి తీసుకోవద్దని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సెహనాజ్‌షేక్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న జడ్పీ సీఈవో సత్యనారాయణ



బోడసింగిపేటలో స్థానికులతో మాట్లాడుతున్న డివిజనల్ పంచాయతీ అధికారి శిరీషారాణి

వేపాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని విజయనగరం జడ్పీ సీఈవో డీవీ సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన వేపాడలో ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణతో పర్యటించారు. గ్రామం శివారులో ఉన్న బక్కునాయుడుపేట రక్షిత తాగునీటి పథకం ట్యాంకును పరిశీలించారు. ట్యాంకును క్రమతప్పకుండా శుభ్రం చేయాలని సూచించారు. శానిటేషన్‌పై ప్రభుత్వం నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌కు జవాబు ఇవ్వవలసిందిగా ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రవికుమార్, ఏవో ఎన్.మహేష్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

● బొండపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి అన్నారు. బోడసింగిపేట గ్రామాన్ని ఆమె గురువారం సందర్శించారు. చెత్త సేకరణ, పారిశుధ్య పనులను పరిశీలించి కార్యదర్శి ఎం.రమేష్‌కు పలు సూచనలు అందజేశారు. అలాగే తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి నీటి వనరుల్లో క్లోరినేషన్ చేయించాలని సూచించారు. డ్వాక్రా సంఘాలకు, పాఠశాల విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీకి సిబ్బంది కొరత ఉంటే క్లాప్ మిత్రలను నియమించి తడి, పొడి చెత్తలను వేర్వేలుగా సేకరించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎ.రఘుపతిరావు, సర్పంచ్ మీసాల జానకిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా?

● వేలాడుతున్న విద్యుత్ తీగలు
● కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభం



కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగను చూపిస్తున్న స్థానికుడు

విజయనగరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రమాదం జరిగి, ప్రాణాలు పోతేకానీ పట్టించుకోరా.. అని గజపతినగరం మండలం గంగచోళ్లపెంట గ్రామస్థులు విద్యుత్ శాఖాధికారులను ప్రశ్నిస్తున్నారు. గ్రామంలోని రోడ్డు వీధిలో గల మజ్జి గౌరవమ్మ గుడి సమీపంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా చేతికి అందేటంత ఎత్తులో వేలాడుతున్నాయి. దగ్గరలో చెట్లకు విద్యుత్ తీగలు తగిలి రాపిడికి గురైన సమయంలో నిప్పురవ్వలు రాలుతున్నాయి. మజ్జి గౌరవమ్మ గుడి దగ్గర నుంచి ఎల్లమ్మ గుడి వరకూ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. దీనిపై గజపతినగరం విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకో లేదని స్థానికులు చెబుతున్నారు. ఇదే రోడ్డులోని మఠం సెంటర్ వద్ద పుచ్చుపోయిన ఇనుప విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



తుప్పు పట్టి కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం, ఇన్‌సెట్‌లో స్తంభం కింది భాగం

జాకేరును ఆరోగ్యవంత గ్రామంగా తీర్చి దిద్దాలి

వేపాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా జాకేరు గ్రామాన్ని ఆరోగ్యవంత గ్రామంగా తీర్చి దిద్దాలని ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ అన్నారు. జాకేరు గ్రామంలో ఆయన గురువారం పర్యటించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని, వెల్నెస్ సెంటర్, సచివాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన ఆయా సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జాకేరు గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా, ఆరోగ్యంవంత గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

బోర్డులూ పీకేస్తున్నారు

● యథేచ్ఛగా ఆక్రమణలు

భోగాపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆక్రమణ స్థలాల్లో రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేస్తున్నా ఆక్రమణదారులు యథేచ్ఛగా ఆ బోర్డులు తొలగించేస్తున్నారు. రావాడ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 64(1)లో కొండను ఆక్రమించుకోవడంతో ఈ ఏడాది మే 30న 'కొండను చదును చేస్తున్న ఆక్రమణదారులు' అను శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీంతో రెవెన్యూ సిబ్బంది స్పందించి జూన్ ఒకటో తేదీన ఆక్రమణలో ఉన్న మొక్కలు తొలగించారు. అనంతరం 'ఆక్రమణ స్థలంలో బోర్డులు ఏర్పాటు ఎప్పుడో' అను శీర్షికతో జూన్ 3న కథనం రావడంతో జూన్ 6న ఇది ప్రభుత్వ స్థలమంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ఆక్రమణదారులు బరితెగించి ఇటీవల ఆ బోర్డులను పీకేశారు. దీనిని గుర్తించిన రెవెన్యూ సిబ్బంది మళ్లీ ఆ స్థలంలో బోర్డులు ఏర్పాటు చేశారు. ఇదేవిధంగా పోలిపల్లి, తదితర గ్రామాల్లో కూడా అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులను పీకేశారు.

● దీనిపై వీఆర్వో కాళీశ్వరరావును వివరణ కోరగా.. రావాడ రెవెన్యూలో ఆక్రమణ స్థలంలో ఏర్పాటుచేసిన బోర్డులు లేకపోవడాన్ని గుర్తించి మళ్లీ ఏర్పాటు చేశామని చెప్పారు. ఇకపై ప్రభుత్వ అధికారులు ఏర్పాటుచేసిన బోర్డులు తొలగించినట్టు తెలిస్తే తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి, చర్యలు తీసుకునే విధంగా చూస్తామన్నారు.



ఆక్రమణ స్థలంలో రెండోసారి బోర్డు ఏర్పాటుచేస్తున్న దృశ్యం(ఫైల్)

ఉపాధి కోసం వెళ్లి.. విగతజీవిగా మారి

● కేరళలో మన్యం యువకుడి ఆత్మహత్య



గోవర్ధనరావు (ఫైల్)

మక్కువ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోన గ్రామానికి చెందిన మడక గోవర్ధనరావు(28) కేరళ రాష్ట్రంలోని కాసరగోడ్ జిల్లా కేంద్రంలో ఆత్మహత్య చేసుకున్నాడు. గోవర్ధనరావు తల్లిదండ్రులు మడక రామకృష్ణ, చిన్నమ్మలకు గురువారం ఆ సమాచారం చేరింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కోన, దబ్బగెడ్డ, గోపాలపురం గ్రామాలకు చెందిన ఆరుగురు యువకులు ఏడాది కిందట ఉపాధి కోసం కేరళ వెళ్లారు. అక్కడ కాసరగోడ్ జిల్లా కేంద్రంలో విశిద కంపెనీ లో పనిచేస్తున్నారు. వారిలో దబ్బగెడ్డకు చందిన యువకునితో కలిసి ఒక గదిలో గోవర్ధనరావు ఉంటున్నాడు. అయితే బుధవారం రాత్రి దబ్బగెడ్డ గ్రామానికి చెందిన యువకుడు తన స్వగ్రామానికి వచ్చాడు. గురువారం ఉద యం సుమారు 10 గంటల సమయంలో వేరే గదిలో ఉంటున్న కోన గ్రామానికి చెందిన మరో యువకుడు.. గోవర్ధనరావు కోసం అతడి గదికి వెళ్లి చూశాడు. గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని గోవర్ధనరావు మృతి ఉండటాన్ని గుర్తించి.. తల్లిదండ్రులకు సమాచారమిచ్చాడు. దాంతో కుటుంబ కన్నీరుమున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న గోవర్ధనరావు అన్నయ్య కేరళ వెళ్లారు. గోవర్ధనరావు మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

ఇంటి నుంచి బయలుదేరిన పది నిమిషాల్లోనే..

● కళ్లు తిరిగి.. బైకు పైనుంచి కింద పడి వ్యక్తి మృతి



రమణ (ఫైల్)

రాజాం రూరల్, జులై 24 (ఆంధ్రజ్యోతి): డ్యూటీకి వెళ్లొస్తానని భార్యకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన పది నిమిషాల్లోనే ఓ వ్యక్తి మృత్యుఒడికి చేరాడు. ఈ ఘటన మండల పరిధిలోని పొగిరి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పొగిరి గ్రామానికి చెందిన శాసపు రమణ(59) అంతకాపల్లి సమీపంలోని ఓ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్నారు. ఎప్పటిలాగే గురువారం ఉదయం 7.30 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై పొగిరి గ్రామంలోని తన ఇంటి నుంచి బయలుదేరిన రమణ.. పొగిరి జంక్షన్‌లోని పీహెచ్‌సీ సమీపానికి చేరుకునేసరికి ఒక్కసారిగా కళ్లు తిరగడంతో ఉన్నఫలంగా వాహనం పైనుంచి రోడ్డుపై పడిపోయారు. తలకు తీవ్రమైన గాయమైన రమణను అక్కడివారంతా క్షణాల్లో చేతులతో మోసుకుంటూ ఎదురుగా ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి 108 వాహనంలో రాజాంలోని సామాజిక ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే రమణ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో పొగిరి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడి కుమారుడు చిరంజీవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



బాలకృష్ణ (ఫైల్)

సాలూరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లేందుకు బయలుదేరుతున్న ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతిచెందిన ఘటన సాలూరు మండలం పాలికవలసలో గురువారం చోటుచేసుకుంది. సాలూరు మండలం పాలికవలసకు చెందిన కోట బాలకృష్ణ(54) అదే మండలంలోని బర్లికవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన గురువారం ఉదయం తన భార్య లక్ష్మితో కలిసి వాకింగ్‌కు వెళ్లి వచ్చారు. అనంతరం ఆయన పాఠశాలకు సిద్ధమయ్యారు. టిఫిన్ చేయడానికి ప్లేటు తీసుకుంటున్న సమయంలో గుండెపోటుతో కుప్పకూలిపోయారు. ఆసుపత్రికి తరలించినప్పటికే ఆయన మృతి చెందారు. ఆయన మృతిపై డీఈవో రాజకుమార్, సీఐటీయూ జిల్లా నేత ఎన్‌వై నాయుడు, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి భార్య లక్ష్మి సాలూరు బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.

వేపాడలో హెల్త్ అసిస్టెంట్..

వేపాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సబ్బిల సాచిరెడ్డి(57) గురువారం గుండెపోటుతో మృతిచెందారు. గత కొంతకాలంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఈయనను ప్రభుత్వం గత ఏడాది రెగ్యులర్ ఉద్యోగిగా నియమించింది. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈయన మృతికి పీహెచ్‌సీ వైద్యులు వేణు, సంజన, సిబ్బంది సంతాపం తెలిపారు.

సెంచూరియన్‌లో అంతర్జాతీయ సదస్సు



'ఇన్నోవేషన్స్ ఇన్ హెల్త్‌కేర్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, జూలై 24(ఆంధ్రజ్యోతి): నేడు కొత్తకొత్త రోగాలను గుర్తించడంలో అత్యాధునిక వైద్య పరికరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీలో గురువారం ఏర్పాటుచేసిన ఇన్నోవేషన్స్ ఇన్ హెల్త్ కేర్ స్టార్ట్ అండ్ అడ్వాన్స్‌డ్ అప్లికేషన్స్ అనే 3 రోజుల అంతర్జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య పరికరాల రూపకల్పనలో ఇంజనీరింగ్, వైద్య రంగాలు కలిసి పనిచేయడం వల్ల అది సాధ్యపడుతుందన్నారు. అనంతరం వైస్ చాన్సలర్ ప్రశాంతకుమార్ మహంతితో కలిసి ఇన్నోవేషన్స్ ఇన్ హెల్త్ కేర్ స్టార్ట్ అండ్ అడ్వాన్స్‌డ్ అప్లికేషన్స్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సదస్సులో సౌదీ అరేబియా ఖాసిమ్ యూనివర్సిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డా.నవీన్‌కుమార్ చల్లా, రిజిస్ట్రార్ డాక్టర్ నాగ, డా.నూకరాజు పాల్గొన్నారు.

పీఆర్‌ఎంఈఏ ఎస్.కోట అధ్యక్షుడిగా నరసింహం

శృంగవరపుకోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీఆర్‌ఎంఈఏ (ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్ట్రియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్) శృంగవరపుకోట యూనిట్ అధ్యక్షుడిగా జామి ఏవో వి.నరసింహం ఎన్నికయ్యారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీఆర్‌ఎంఈఏ ఎస్.కోట యూనిట్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక ఏపీ ఎన్జీవో జిల్లా సెక్రటరీ ఆవు సురేష్, ఏపీపీఆర్‌ఎంఈఏ జిల్లా అధ్యక్షుడు చింతాడ మురళి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా కేబీ శ్రీనివాసరావు వ్యవహరించారు. యూనిట్ అధ్యక్షుడిగా నరసింహం ఎన్నిక కాగా, కార్యదర్శిగా డి.లత, ఉపాధ్యక్షురాలిగా డి.రాధ, సంయుక్త కార్యదర్శిగా టి.ఎల్లమ్మ, కోశాధికారిగా వి.గౌతం, జిల్లా కౌన్సిలర్లుగా బి.శ్రీధర్, జి.ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఎస్.కోట, జామి మండలాలకు చెందిన ఏపీపీఆర్‌ఎంఈఏ ఉద్యోగులు రికార్డు అసిస్టెంట్లు, టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం కావాలి

(5వ పేజీ తరువాయి)

కన్నయ్యగూడ అంగన్వాడీ కేంద్రం, మండల పరిషత్ పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. అంగన్వాడీ కేంద్రం మరమ్మతులకు, పాఠశాల అదనపు తరగతి గది నిర్మాణానికి, నిర్వహణ కోసం నిధులు మంజూరు చేస్తామని అన్నారు. కురుపాం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కేఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి, కురుపాం ఎంపీడీవో ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మరో ఉద్దానం

(5వ పేజీ తరువాయి)

అందుతుంది. అయితే, తాము తాగుతున్న నీరు సురక్షితమైనదేనా? లేక, ఏమైనా కలుషితం అవుతుందా? అన్నది తెలియడం లేదని రెండు గ్రా మాల ప్రజలు అంటున్నారు. ఇంతవరకు తమ గ్రామాలకు వైద్యసిబ్బంది వచ్చిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రెండు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

పెరుగుతున్న సీకేడీ రోగులు..

సీతంపేట ఏజెన్సీలో క్రానిక్ కిడ్నీ డిసీజ్(సీకేడీ)రోగుల సంఖ్య ఇటీవల కాలంలో ఎక్కువగా నమోదవుతుంది. సీతంపేట ఏరియా ఆసుపత్రిలో గత ఆరునెలలుగా 33మంది సీకేడీతో బాధపడుతూ వైద్యసేవలు పొందుతున్నారు. వీరిలో అత్యధికులు సీతంపేట ఏజెన్సీకి చెందిన గిరిజనులే. వీరిలో కొందరు మృతిచెందగా, మరికొందరు డయాలసిస్ స్టేజ్‌లో జీవిస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కిడ్నీ సంబంధిత వ్యాధులు విస్తరించేందుకు గల మూలాలను అన్వేషించి, నివారణ చర్యలు చేపట్టాలని మన్యం వాసులు కోరుతున్నారు.

శివారు భూములకు సాగునీరు అందేనా?

(5వ పేజీ తరువాయి)


చప్ప బుచ్చింపేట 12 ఎల్ కాలువలో పాడైన షట్టర్లు

నీరు వెళ్లడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో కుడి, ఎడమ ప్రధాన కాలువల్లో వ్యర్థాలు, పిచ్చి మొక్కలను యంత్రాలతో తొలగించారు. అయితే, మరలా కాలువల్లో పిచ్చిమొక్కలు పేరుకుపోవడంతో సాగునీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుంది. ఇప్పటికైనా జైకా నిధులతో ప్రధాన కాలువల ఆధునికీకరణ పనులు పూర్తి చేసి, శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని రైతు లు కోరుతున్నారు.

నిధులు వచ్చిన వెంటనే పనులు చేస్తాం

వెంగళరాయసాగర్ కుడి, ఎడమ ప్రధాన కాలువల ఆధునికీకరణ పనులు 23 శాతం జరిగాయి. రూ.10 కోట్లతో చేసిన ఈ పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో వాటిని మధ్యలో ఆపివేశారు. నిధులు వచ్చిన వెంటనే వీఆర్ఎస్ కాలువల ఆధునికీకరణ పనులు నిర్వహిస్తాం.

-రాజశేఖర్, వీఆర్ఎస్ జేఈ

ప్రగతి 'బాట'లో..

(5వ పేజీ తరువాయి)


నాడు.. పూడి-మెళియాకంచు రహదారి


నేడు.. పూడి-మెళియాకంచు రోడ్డు

ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా అత్యవసర వేళల్లో ఆసుపత్రులకు వెళ్లేందుకు నానా కష్టాలు పడేవారు. గిరి శిఖర గ్రామస్థులకైతే డోలీ మోతలు తప్పేవి కావు. కొండలు దిగి.. కిలోమీటర్ల మేర రాళ్లు, రప్పలు దాటుకుని ఆసుపత్రులకు చేరుకునే లోపు ఎంతోమంది రోగులు మృతి చెందేవారు. అయితే వారి కష్టాలను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేసింది. ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి నిధులు మంజూరు చేస్తుండడంతో రహదారుల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి.

రహదారుల నిర్మాణాలు ఇలా..

● పాచిపెంట మండలం పూడి నుంచి మెళియాకంచు వరకు ఎనిమిది కిలోమీటర్ల మేర బీటీ రహదారిని నిర్మించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.కోటీ 50 లక్షలతో పనులు ప్రారంభించి పనులు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.నాలుగు కోట్ల 50 లక్షలతో ఈ రోడ్డు పనులను పూర్తి చేయించింది. దీంతో సుమారు 20 గిరిజన గ్రామాల్లో 8,800 ప్రజల రహదారి కష్టాలు తీరాయి. వారికి డోలీ ఇబ్బందులు కూడా తొలగిపోయాయి. ఇదిలా ఉండగా అదే మండలంలో కొండ శిఖర గ్రామం కొండమోసూరు-కోదువలసకు రూ.కోటీ 25 లక్షలతో బీటీ రహదారిని నిర్మించారు.

● సాలూరు మండలం పడాలవలస నుంచి చిమిడివలస వయా కొత్తూరు గ్రామానికి చెందిన రహదారి గతంలో దారుణంగా ఉండేది. వర్షం పడిందంటే ఆ గ్రామాలకు ప్రజలు రాకపోకలు సాగించలేకపోయేవారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఈ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన మాత్రమే చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటీ 25 లక్షలతో బీటీ రహదారిని నిర్మించింది.

● కొమరాడ మండలం దిగువ గుణద, ఇన్నీడి, సవర గుండా పలు గ్రామాలకు సుమార రూ.3కోట్ల పది లక్షలతో పక్కా రహదారిని నిర్మించారు. దీంతో ఆ ప్రాంతవాసులు దశాబ్దాల నాటి సమస్యకు పరిష్కారం లభించింది.

● కురుపాం మండలం జి.శివడ, రాముడుగూడ, కీడివాయి గ్రామాలకు రూ.రెండు కోట్ల 90 లక్షలతో పక్కా రహదారిని నిర్మించారు. దీంతో ఆయా గ్రామస్థులు డోలీ మోతలు తప్పాయి.

● జియ్యమ్మవలస మండలం సీటీ మండగోడ నుంచి సిటీ మండకు రూ.కోటీ 32 లక్షలతో పక్కా రహదారి నిర్మించారు.

పక్కా రహదారుల నిర్మాణమే లక్ష్యం

డోలీలు మోతలు లేకుండా ప్రతి గిరిజన గ్రామానికీ పక్కా రహదారి నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతాల్లో సుమారు వంద రహదారులు నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందులో 35 పనులు పూర్తయ్యాయి.

- గుమ్మిడి సంధ్యారాణి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి

ప్రభుత్వ ఆదేశాలతో ..

ప్రభుత్వ ఆదేశాలతో పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో వంద రహదారుల నిర్మాణాలు ప్రారంభించాం. ఇప్పటికే 35 రహదారులు పూర్తికాగా మిగిలిన రహదారుల పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

- మణిరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గిరిజన ఇంజనీరింగ్ శాఖ, పార్వతీపురం ఐటీడీఏ

కూటమితోనే సుపరిపాలన


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

జియ్యమ్మవలస, జూలై24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని అంకవరంలో గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు జోగి భుజంగరావు అధ్యక్షతన నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ఈ సందర్భంగా 50 యాదవ కుటుంబాలు ఆమె సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపీపీ బొంగు సురేష్, వట్టిగెడ్డ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎం.సత్యంనాయుడు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అండగా ఉంటాం

●గరుగుబిల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటుందని, అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. గురువారం లఖనాపురంలో కొద్ది రోజుల కిందట మృతి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు పి.నీలయ్య, కార్యకర్త టి.పొట్టియ్య కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు కుటుంబాలకు పార్టీపరంగా ఆదుకుంటామన్నారు. అంతకుముందు గ్రామంలో పలు సమస్యలను తెలుసుకొనేందుకు పరిశీలించారు. పంచాయతీల పరిధిలో ప్రధాన సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. కార్యక్రమంలో ముదిలిబాబు, విజయవాంకుశం, ఎన్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి


విద్యార్థులతో డీఎస్పీ అంకితా సురాన్

సాలూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండా డీఎస్పీ అంకితా సురాన్ సూచించారు. గురువారం పట్టణంలోని సత్యసాయి విద్యాసంస్థలను ఆమె సందర్శించారు. విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈగల్ క్లబ్స్ విధి విధానాలను తెలిపారు. సైబర్ క్రైమ్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, మహిళా చట్టాల కోసం వివరించారు. ర్యాగింగ్ తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాలూరు పట్టణ సీఐ, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి లక్ష్యం


తొలి అడుగు నిర్వహిస్తున్న ఏఎంసీ చైర్మన్

పాచిపెంట, జూలై24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని సాలూరు ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ తెలిపారు. గురువారం మండలంలోని గురువునాయుడుపేట, రాయిగుడ్డివలస, బూతాడవలస, చొక్కాపువానివలస తదితర గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. పార్టీలకు అతీతంగా కుల, మతాల బేధాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గూడేపు యుగంధర్, నాయకులు పూసర్ల నరసింగరావు,తవిటినాయుడు, కొత్తల పోలినాయుడు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై అవగాహన

సాలూరు, జూలై24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ సమావేశ మందిరంలో గురువారం శానిటరీ సెక్రటరీలు, ఏఎన్ఎంలతో పారిశుధ్య నిర్వహణపై కమిషనర్ టీవీ ప్రసాద్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిషనర్‌తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించేలా చూడాలన్నారు. ప్రతీ ఇళ్లల్లో నీరు నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణ తప్పనిసరిగా జరగాలన్నారు. కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్‌వో, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి జయంతి


అల్లంకికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాలకొండ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని గురువారం పాలకొండ శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు.గ్రంథాలయ ఉద్యమంలో అయ్యంకి సేవలను కొనియాడారు. కార్య క్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఈశ్వర్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

●గరుగుబిల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకుడు నల్ల మధుసూదనరావు అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.సింహాచలనాయుడుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

సీతంపేట రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈత మానుగూడ గ్రామ పరిసరాల్లో 20 లీటర్ల సారాతో సవర బాలిమ్మను గురువారం అరెస్టు చేశామని ఎస్ఐ అమ్మన్నరావు తెలిపారు. సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా సారాతో ఆమె గుర్తించామన్నారు.

భవనం మంజూరుకు కృషి చేస్తా

సీతంపేట రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలోని గిరిశిఖర గ్రామం ఎగువదారబలోని జీపీఎస్ పాఠశాలలో గిరిజన చిన్నారులు పడుతున్న ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం 'ఇలా అయితే చదివేదేలా' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఐటీడీఏ అధికారులు స్పందించారు. గురువారం ఏపీవో చిన్నబాబు ఆ గ్రామానికి చేరుకుని పాఠశాలను పరిశీలించారు. అక్కడ చిన్నారులు ఎదుర్కొంటున్న వసతి సమస్యను గుర్తించి పాఠశాల భవనం మంజూరుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఇళ్ల పన్ను వసూళ్లకు ప్రత్యేక పోర్టల్

రామభద్రపురం, జూలై24(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలలో ఇళ్ల పన్నుల వసూళ్లకు ప్రత్యేక పోర్టల్‌లను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని డిప్యూటీ ఎంపీడీవో మరడ వెంకటరమణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆగస్టు 1 నుంచి ఆన్‌లైన్ ద్వా రా ఇంటి పన్నుల వసూళ్లు చేపడతామన్నారు. దీనిపై పంచాయతీరాజ్ కమి షన్ నుంచి ఆదేశాలు వచ్చాయని, స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో యజమాని వివరాలు, ఆధార్, మొబైల్ నెంబరు ఆన్‌లైన్ చేసి నిర్ధారించుకుంటామని తెలి పారు. దీనిపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములు నాయుడు పాల్గొన్నారు.

సక్రమంగా వైద్య సేవలు అందించండి


మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి

సీతానగరం, జూలై24 (ఆంధ్రజ్యోతి): రోగులకు సక్రమంగా వైద్యసిబ్బంది సేవలు అందించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ పీఎల్ రఘు సూచించారు. మండలంలోని చినభోగిలి గ్రామంలో 104 సంచార వైద్య శిబిరాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు నిర్వహిస్తున్న వైద్య తనిఖీలను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టి జ్వర లక్షణాలు ఉన్న వారిని త్వరగా గుర్తించాలని స్పష్టం చేశారు. వాహనంలో ఉండే ఈసీజీ యంత్రం పనితీరుతో పాటు మందుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీతానగరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఉషారాణి, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల గుర్తింపు

గరుగుబిల్లి, జూలై24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలలో ప్రభుత్వ నిబంధనల మేరకు బంగారు కుటుంబాలను గుర్తించాలని ఎంపీడీవో జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు సూచించారు. గురువారం మండలంలోని ఉద్దవోలులో పీ-4 కార్యక్రమ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ 13 సచివాలయాల పరిధిలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. గుర్తించిన కుటుంబాలకు సంబంధించి సమాచారాన్ని తగు చర్యలు నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.భూదేవి, ప్రసాదరావుతో పాటు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సంపద కేంద్రాలపై దృష్టిపెట్టండి

గరుగుబిల్లి, జూలై24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో చెత్త నుంచి సంపద కేంద్రాలపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. గురువారం ఉద్దవోలులోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేసి రైతులకు అందించాలన్నారు. పంచాయతీలకు కొంతమేర ఆర్థికంగా బలోపేతానికి కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. పరిశీలనలో డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు, సర్పంచ్ వి.భూదేవి, ప్రసాదరావు, కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న మహిళలు

పాలకొండ, జూలై24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం దేవాంగుల కులదైవం చౌడేశ్వరిదేవి అమ్మవారికి మహిళలు ఘనంగా పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం దుర్గగుడి ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేపట్టారు.

9560 కొబ్బరి మొక్కల పంపిణీ

సీతానగరం, జూలై24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువు గట్లుపై కొబ్బరి మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు వేతనదారులు, పంచాయతీ పాలకులు తీసుకోవాలని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని 27 గ్రామాలకు సంబంధించి చెరువుల గట్లుపై కొబ్బరి మొక్కలు నాటడానికి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 9,560 కొబ్బరి మొక్కలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కొబ్బరి మొక్కలు చెరువు గట్లుపై నాటిన అనంతరం ఫలసాయం వచ్చేవరకూ సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీవో బాలకృష్ణ పాల్గొన్నారు.

గిరి చైతన్యం వాహనం రెడీ



వీరఘట్టం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం వెలుగు కార్యాలయానికి బుధవారం గిరి చైతన్యం వాహనం చేరుకుంది. గిరిజనులు సంతల్లో నాసిరకం వస్తువులు కొనుగోలు చేసి ఆరోగ్యం పాడు చేసుకుంటున్న నేపథ్యంలో ఈ వాహనం ద్వారా మండలంలోని మహిళా మార్టుల నుంచి నాణ్యమైన వస్తువులను గిరిజనులకు అందుబాటు ధరల్లో అందించనున్నారు. త్వరలో ఈ వాహనం ద్వారా గిరిజనుల సేవలు అందనున్నాయని ఏపీఎం కె.రాము తెలిపారు.

హమ్మయ్యా.. గుంతను పూడ్చారు


గుంతను పూడుస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పార్వతీపురం టౌన్, జూలై24 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం బైపాస్ రోడ్డు పడిన భారీ గుంతను ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులు గురువారం పూడ్చివేయించారు. 'రహదారిలో భారీ గుంత' శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్అండ్‌బీ ఈఈ రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో గుంతను పూడ్చారు. దీంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు.

స్మార్ట్ మీటర్లు వద్దు


సమావేశంలో పాల్గొన్న వామపక్ష నాయకులు

బెలగాం, జూలై24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నష్టం కలిగించే విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించకుండా ప్రజలు అడ్డుకోవాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్మార్ట్ రద్దు చేయాలని స్థానిక సుందరయ్య భవనంలో వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ ఆగస్టు 4న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. వెంటనే స్మార్ట్ మీటర్లు తొలగించాలని, స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు కొల్లి గంగునాయుడు, రెడ్డి వేణు, శ్రీను నాయుడు, పోల ఈశ్వరరావు, సంగం, రంజిత్ కుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు ప్రజా సంఘాల నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

గుమ్మలక్ష్మీపురం, జూలై24 (ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ ముఖ్యమంత్రి, ప్రజా ఉద్యమ నేత వి.ఎస్.అచ్యుతానందన్‌కు గురువారం ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ మాట్లాడుతూ దేశంలో ప్రజాదరణ పొందిన పోరాటాలను నిర్మించిన నేత అచ్యుతానందన్ అని కొనియాడారు. నవ కేరళ నిర్మాణంలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కె.గౌరీశ్వరరావు, సత్యవతి, కస్తూరి, నిర్మల తదితరులున్నారు.

ఒట్టిగెడ్డ వంతెనకు మరమ్మతులు చేపట్టండి


వంతెనపై నిలిచిన వరదనీరు, వ్యర్థాలు

వీరఘట్టం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం సమీపంలోని ఒట్టిగెడ్డ వంతెన మరమ్మతుకు గురైంది. వర్షపునీరు వంతెనపైనే నిలుస్తోంది. ఏక్షణాన్నైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలిన అవసరం ఉంది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భామిని, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లివిరి నుంచి కొరమ వరకు 11 కేవీ విద్యుత్ సరఫరా లైన్ల నిర్వహణ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ శ్రీని వాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వినియోగదారులు సహకరిం చాలని ఆయన కోరారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

కొమరాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలోని కెమిసీల ఆశ్రమ పాఠశాలలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నలుగురు విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. త్వరలో కళ్లజోళ్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా నేత్ర సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి వేణుగోపాలరావు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.